సాక్షి నిర్మల్
శుక్రవారం । 21 । జూలై । 2023



అప్రమత్తతే రక్ష

వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పొలాలకు నీరందించే క్రమంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. 8లో▸



పోడు కోసం అటవీభూమి చదును

కడెం మండలంలోని లక్ష్మిసాగర్‌తండా వాసులు గురువారం గ్రామ శివారులో పోడు సాగు కోసం అటవీ భూమిని చదును చేస్తుండగా అటవీ అధికారులు అడ్డుకున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
26.4 /23.2

వాతావరణం

ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రుతుపవనాలు, అల్పపీడన ప్రభావంతో జిల్లా అంతటా వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

తీజ్ సంబరాల్లో ఎమ్మెల్యే



తీజ్ సంబరాల్లో ఎమ్మెల్యే రేఖానాయక్...

దస్తురాబాద్: మండలంలోని మున్యాల తండా గ్రామపంచాయతీలో గురువారం తీజ్ పండుగ నిర్వహించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ వేడుకల్లో పాల్గొన్ని యువతులతో కలిసి నృత్యం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన తాండాల్లో తీజ్ ఉత్సవాలను జరుపుకోవడం ఆనవాయితీ అని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేశ్‌నాయక్ బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్

నిర్మల్‌టౌన్: భారీ వర్షాల దృష్ట్యా నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రాజు గురువారం ప్రకటనలో తెలిపారు. ప్రజలకు ఏవైనా ఇబ్బందులు తలెత్తితే టోల్ ఫ్రీ నంబర్ 7993396793కు ఫోన్ చేయాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం ఈ టోల్ ఫ్రీ నంబర్ 24 గంటలు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

'ఆవేదన' ఆవిష్కరణ



షార్ట్ ఫిల్మ్‌ను ఆవిష్కరిస్తున్న దేవేందర్‌రెడ్డి

నిర్మల్‌ఖిల్లా: రోడ్డు ప్రమాదాల బారినపడే బాధితకుటుంబాల ఆవేదనను షార్ట్ ఫిల్మ్ రూపంలో అద్భుతంగా ఆవిష్కరించడం గొప్ప విషయమని జిల్లా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ దేవేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 'ఆవేదన' షార్ట్ ఫిల్మ్‌ను గురువారం ఆవిష్కరించారు. జిల్లా ఆస్పత్రి ఆర్‌ఎంవో డాక్టర్ వేణుగోపాలకృష్ణ నాగవైష్ణవి పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తూ, తానే ప్రధాన పాత్రలో నటించడం గొప్ప విషయమని అన్నారు. సమాజానికి ఈ చిత్రం ద్వారా మంచి సందేశాన్ని అందించినట్లు ప్రశంసించారు. డా.వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ.. రోడ్లపై వాహనదారులు ప్రయాణికులు సురక్షితంగా వెళ్లాలని ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణాలు జరగాలనే సందేశంతోనే ఈ షార్ట్‌ఫిల్మ్ రూపొందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్, వైద్యులు రత్నాకర్‌రెడ్డి, శ్రీకర్, అమర్, మాధవి, నర్సింగ్ సూపరింటెండెంట్ భారతి, సీనియర్ అసిస్టెంట్ స్వరూప, ఫార్మసిస్టు శ్రీనివాసచారి, నర్సింగ్ సిబ్బంది శోభ, మహేశ్, ప్రవీణ్, గణేశ్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సైలు



ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్‌తో ఎస్సైలు

భైంసాటౌన్: నిజామాబాద్ జిల్లా నుంచి బదిలీపై వచ్చిన పలువురు ఎస్సైలు భైంసా పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్సైలు నరేశ్, సాయికుమార్, మోసెస్ భైంసా పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, సీఐ ఎల్.శ్రీనును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం బాధ్యతలు చేపట్టారు. విధులు బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని ఏఎస్పీ సూచించారు.

పంటలను పరిశీలించిన డీఏవో



సోయా పంటను పరిశీలిస్తున్న డీఏవో

తానూరు: మండలంలోని భోసి, బెల్‌తరోడా, మహాలింగి గ్రామాల్లో రైతులు సాగు చేసుకున్న సోయా పంటలను జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెడ్‌పై వేసిన సోయా పంటల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పత్తి చేలను పరిశీలించి చేలల్లో నీరు నిలవకుండా చూడాలన్నారు. డీఏవో వెంట ఏఈవో విష్ణు, రైతులు శివకుమార్, దేవేందర్‌నాయక్, దత్తు, గాయక్‌వాడ్ సాయినాథ్ తదితరులు ఉన్నారు.

వాన జోరు.. వరద హోరు



వరద పెరగడంతో నిండుకుండను తలపిస్తున్న సదర్మాట్

- ప్రాజెక్టులకు జలకళ
- ఎస్సారెస్పీలోకి భారీగా వరద
- లోతట్టు ప్రాంతాలు జలమయం

భైంసా: జిల్లాలో మూడోరోజు గురువారం కూడా మోస్తారు వర్షం కురిసింది. ఏకధాటిగా కురుస్తున్న వానలకు చెరువులు, కుంటలు జలకళ సంతరించుకున్నాయి. వాగులు ఉరకలెత్తుతున్నాయి. ప్రాజెక్టులకు భారీగా వరద వస్తోంది. దీంతో జిల్లా రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు మోస్తారు వర్షాలు కురియలేదు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటపొలాల్లో నీరు కనిపిస్తోంది.

ప్రాజెక్టుల్లో వరద నీరు...

ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టుల్లోకి వరద నీరు చేరుతోంది. ఎస్సారెస్పీలోకి భారీగా వరద వస్తుండడంతో నీటిమట్టం 37 టీఎంసీలకు చేరింది. మూడు రోజుల్లో 4 టీఎంసీల నీరు చేరింది. గోదావరి నుంచి 59,165 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుందని అధికారులు తెలిపారు. మహారాష్ట్రలోనూ వర్షాలు కురుస్తుండడంతో రెండు రోజుల్లో ఇన్‌ఫ్లో మరింత పెరుగుతుందని పేర్కొంటున్నారు. గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి కూడా వరద వస్తోంది.

లోతట్టు ప్రాంతాలు జలమయం...

మూడు రోజుల వానలకు జిల్లాలో లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరి జనం ఇబ్బందులు పడుతున్నారు. బాసరలోని రవీంద్రాపూర్‌కాలనీ, మైలాపూర్ పాఠశాల వెనుకభాగంలో వరదనీరు చొచ్చుకువచ్చింది. భైంసా మండలం వాడి గ్రామం వద్ద నిర్మించిన పల్సికర్‌రంగారావు ప్రాజెక్టులోనూ వరద నీరు చేరుతుంది. ప్రాజెక్టు నిండితే గుండేగాంలోకి వరదనీరు చొచ్చుకువస్తుందని అధికారులు అప్రమత్తంగా ఉంటున్నారు. రెవెన్యూ, పోలీసు యంత్రాంగం ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

జలమయమైన పొలాలు...

ముధోల్, తానూరు, భైంసా వాగు పరిసర ప్రాంతాల్లోని పంటపొలాలు జలమయమవుతున్నాయి. ముధోల్‌లో పత్తిచేలు నీటిలో కనిపిస్తున్నాయి. వర్షపు నీటితో వరి పొలాల్లో ట్రాక్టర్లతో దమ్ముచేయిస్తున్నారు. నారుపోసిన రైతులు చెరువులు నిండడంతో ఎలాగైన పంటవేస్తామని ఆనందం వ్యక్తంచేస్తున్నారు. లోకేశ్వరం, దిలావర్‌పూర్, నర్సాపూర్, భైంసా, లక్ష్మణచాంద మండలాల్లో పొలాల్లో వర్షపునీటికి దమ్ముచేసే పనులు ప్రారంభమయ్యాయి. చాలాచోట్ల వరినాట్లు వేస్తున్నారు.

సారంగాపూర్‌లో అత్యధికం..

జిల్లాలో గురువారం సారంగాపూర్ మండలంలో అత్యధికంగా 52.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తానూరు మండలంలో అత్యల్పంగా 4.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నిర్మల్ జిల్లాలో సగటున 15.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

సదర్మాట్‌కు పెరిగిన వరద

ఖానాపూర్: మండలంలోని మేడంపల్లి గ్రామంలోని సదర్మాట్ ఆనకట్టకు వరద పెరిగింది. మూడురోజులుగా ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో సదర్మాట్‌కు జలకళ సంతరించుకుంది. గరిష్ట నీటిమట్టం 7.6 ఫీట్లు కాగా, గురువారం 8.2 ఫీట్లకు వరద పెరిగింది. మత్తడి దూకుతున్న సదర్మాట్‌ను చూసేందుకు సందర్శకులు తరలి వస్తున్నారు.

జిల్లాలో వర్షపాతం ఇలా...

మండలం	నమోదైన వర్షపాతం (మి.మీ.)
సారంగాపూర్	52.6
కడెం	28.4
లక్ష్మణచాంద	22.4
నిర్మల్	20.6
కుంటాల	19.6
దస్తురాబాద్	17.2
నిర్మల్‌రూరల్	12.4
మామడ	12.4
బాసర	11.4
దిలావర్‌పూర్	11.2
పెంబి	11.2
లోకేశ్వరం	10.2
ముధోల్	9.8
భైంసా	9.6
నర్సాపూర్	9.4
సోన్	8.6
ఖానాపూర్	8
కుభీర్	7.4
తానూరు	4.6



బాసరలోని రవీంద్రాపూర్‌కాలనీలో వరదనీరు



వేంకూర్ వద్ద వరద ఉధృతిని పర్యవేక్షిస్తున్న అధికారులు



వడపన వాగు వంతెన పైనుంచి వరద ఉధృతి..

పనుల్లో వేగం పెంచండి



పనుల ప్రగతిపై ఆరాతీస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

దిలావర్‌పూర్: జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో రూ.290 కోట్ల వ్యయంతో చేపట్టిన కాళేశ్వరం 27వ ప్యాకేజీ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. గుండంపల్లిలోని గోదావరి పరీవాహక ప్రాంతంలోని 27వ ప్యాకేజీ పంప్‌హౌస్ పనులను గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా సంబంధిత శాఖ అధికారులతో పనుల పురోగతి, ప్రారంభానికి పట్టే సమయం తదితర వివరాలు తెలుసుకున్నారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం డిస్ట్రిబ్యూటరీ చానల్‌తోపాటు టన్నెల్ పనులను పరిశీలించారు. కలెక్టర వెంట ఇరిగేషన్ అధికారులు సుశీల్‌కుమార్, రామారావు, తహసీల్దార్ కరీం, ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజీజ్‌ఖాన్, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ దేవేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వాన చినుకులు భూమిలో ఇంకాలి



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న సుధీర్‌కుమార్

పెంబి: ప్రతీ వాన చినుకు భూమిలో ఇంకేలా చూడాలని జెడ్పీ సీఈవో సుధీర్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంతోపాటు నాగాపూర్, జంగుగూడ గ్రామాల్లో గురువారం పర్యటించారు. ప్రతీ గ్రామంలో 15 సామూహిక ఇంకుడు గుంతలు నిర్మించాలన్నారు. అనంతరం నర్సరీల్లో మొక్కల పెంపకం, సెగ్రిగేషన్ షెడ్లలో చెత్తతో ఎరువులు తయారు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిలవకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో రత్నాకర్‌రావు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కులవృత్తులకు జీవం పోసిన కేసీఆర్



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- బీసీ కులవృత్తుల వారికి చెక్కుల పంపిణీ

నిర్మల్‌టౌన్: ఉమ్మడి రాష్ట్రంలో నిరాదరణకు గురైన కుల వృత్తులకు సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీవం పోస్తోందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. కుల వృత్తులనే నమ్ముకుని జీవిస్తున్నవారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రూ.లక్ష సాయం అందించి అండగా నిలుస్తున్నారని తెలిపారు. సమీకృత కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ కులవృత్తుల వారికి మంజూరైన రూ.లక్ష సాయం చెక్కులను గురువారం పంపిణీ చేశారు. 50 మంది లబ్ధిదారులకు చెక్కులు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... జిల్లాలో మొదటి విడతగా నియోజకవర్గానికి 50 మంది చొప్పున రూ.లక్ష అందజేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 14,521 మంది నమోదు చేసుకున్నారని, వారిలో 11,746 లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ రాంబాబు, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, డాక్టర్ సుభాష్‌రావు, డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, అల్లోల మురళీధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మరుగొండ రాము, మున్సిపల్ విప్ నేరెళ్ల వేణు, జెడ్పీటీసీలు, సర్పంచులు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ ప్రవీణ్‌కుమార్



ఎస్పీ ప్రవీణ్ కుమార్

నిర్మల్‌టౌన్: రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయం నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని పోలీస్ అధికారులకు, సిబ్బందికి గురువారం పలు సూచనలు చేశారు. వర్షాల దృష్ట్యా వాగులు పొంగిపొర్లి చెరువులు, కుంటలు నిండుకుండ లాగా మారాయని, ప్రమాదకరంగా ఉన్న చెరువులు, కుంటల వద్దకు ప్రజలు వెళ్లకుండా చూడాలన్నారు. సర్పంచులు చెరువులు, వాగుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షానికి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మట్టి ఇళ్లు కూలిపోయే అవకాశం ఉందని, అలాంటి ఇళ్లలో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, తక్షణ సహాయం కోసం డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. జిల్లాలో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల దృష్ట్యా పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి, ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న చెరువులు, కుంటల నీటి ప్రవాహం గురించి ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. రోడ్లపై చెట్లు పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

మాజీ మంత్రి రాంచంద్రారెడ్డి అస్తమయం



చిల్కూరి రాంచంద్రారెడ్డి (ఫైల్)



దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డితో రాంచంద్రారెడ్డి (ఫైల్)

- అనారోగ్యంతో ఆస్పత్రిలో కన్నుమూత
- రాజకీయాల్లో 'చిల్కూరి'ది చెరగని ముద్ర
- నేడు స్వగ్రామం ఖోడద్‌లో అంత్యక్రియలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన మాజీ మంత్రి చిల్కూరి రాంచంద్రారెడ్డి (78) కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో ఈ నెల 18వ తేదీన హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చేరారు. పరిస్థితి విషమించి గురువారం సాయంత్రం 4.30గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి పోటీచేసిన ఆయన నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి సేవలందించారు. 1990–92 మధ్య కాలంలో అప్పటి సీఎం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి మంత్రి వర్గంలో రాష్ట్ర చిన్ననీటి పారుదల, మార్కెటింగ్, గిడ్డంగుల శాఖ ఇండిపెండెంట్ మంత్రిగా పని చేశారు. రాజకీయాల్లో అజాతశత్రువుగా పేరు పొందిన ఆయన గ్రామ గ్రామాన అభిమానులను సంపాదించుకున్నారు. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే పార్టీ శ్రేణులు, కుటుంబీకులు, అభిమానులు దుఃఖసాగరంలో మునిగారు. తన జీవిత చరమాంకం వరకు కాంగ్రెస్ కోసమే పనిచేశారు. తలమడుగు మండలం ఖోడద్ గ్రామంలో 1944, ఏప్రిల్ 4న జన్మించిన ఆయన ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌లో స్థిరపడ్డారు. ఆయనకు భార్య లక్ష్మీదేవి ఉన్నారు.

రాజకీయాల్లో చెరగని ముద్ర

పంచాయతీ సమితి అధ్యక్షుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన రాంచంద్రారెడ్డి జిల్లా రాజకీయాలపై చెరగని ముద్ర వేశారు. 1978లో తొలిసారి స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఆయన అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి చిల్కూరి వామన్‌రెడ్డిపై విజయం సాధించి తన సత్తా చాటారు. 1983లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆయన స్వతంత్ర అభ్యర్థి వామన్‌రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. తిరిగి 1985లో మరోసారి ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలోకి దిగి టీడీపీ అభ్యర్థి లక్ష్మణ్‌రావుపై విజయం సాధించారు. 1989లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన ఆయన టీడీపీ అభ్యర్థి చంద్రకాంత్‌రెడ్డిపై గెలుపొందారు. 1994, 1999 ఎన్నికల్లో ఓటమి చవి చూసిన రాంచంద్రారెడ్డి 2004లో మరోసారి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి టీడీపీ అభ్యర్థి జోగు రామన్నపై విజయం సాధించారు. 2009, 2012 ఎన్నికల్లో జోగు రామన్న చేతిలో పరాజయం పాలయ్యారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికలకు దూరంగా ఉంటూ వచ్చిన ఆయన పార్టీ పటిష్టతకు పనిచేస్తూ వచ్చారు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి, నాలుగుసార్లు గెలుపొందారు. రాష్ట్ర ఇండిపెండెంట్ మంత్రిగానూ సేవలందించారు.

ఇళ్ల స్థలాలిచ్చిన ఘనత ఆయనదే..

నియోజకవర్గ అభివృద్ధికి ఆహర్నిశలు శ్రమించిన రాంచంద్రారెడ్డి పేదల అభ్యున్నతికి ఎంతో పాటుపడ్డారు. పట్టణంలోని రాంనగర్, కేఆర్‌కే కాలనీ, చిల్కూరి లక్ష్మీనగర్, బంగారుగూడ, బట్టిసావర్‌గాం పరిధిలోని సర్వే నంబర్ 170లో వేలాదిమంది నిరుపేదలకు ఇంటి స్థలాలు అందించి పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత ఆయనకే సొంతం. జిల్లా కేంద్రంలో రిమ్స్ వైద్య కళాశాల ఏర్పాటు, తాంసి మండలం వడ్డాడి మత్తడివాగు ప్రాజెక్ట్ నిర్మాణం కూడా ఆయన కృషి ఫలితమే. ఎమ్మెల్యేగా ప్రతి గ్రామంలోనూ నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించి పేదలకు సొంతగూడు కల్పించారు.

తుదిశ్వాస వరకూ కాంగ్రెస్‌లోనే..

కాంగ్రెస్‌లో చేరిన నుంచి తుదిశ్వాస విడిచేవరకూ రాంచంద్రారెడ్డి ఇదే పార్టీలో కొనసాగారు. గత ఏప్రిల్ 26న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నిర్వహించిన నిరుద్యోగ గర్జన సభలో రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు. శ్రీరామ నవమి రోజున జన్మించడంతో ఆయన పుట్టినరోజు వేడుకలను అదే పండగ రోజు నిర్వహించేవారు. తులాభారం నిర్వహించి పేదలకు అన్నదానం చేసేవారు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం ఉదయం 11గంటలకు తన స్వగ్రామమైన ఖోడద్‌లో నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.

పసుపు మార్కెటింగ్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

లక్ష్మణచాంద: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పసుపు రైతులకు పసుపు పంట మార్కెటింగ్‌పై మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం అవగాహన కల్పించారు. ఎన్‌సీడీఈఎక్స్(నేషనల్ కమెడిటీ డెరివేటివ్ ఎక్స్‌చేంజ్) అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులకు అవగాహన కల్పించారు. నాబార్డు డీజీఎం అబ్దుల్ రవూస్ పసుపు పంట సాగు తరువాత మార్కెటింగ్ చేసేక్రమంలో అన్నదాతలకు పాటించాల్సిన జాగ్రత్తలపై కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు రైతులకు కొన్ని నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీ మాస్ డైరెక్టర్ మురళి, ఎన్‌డీడీఈఎక్స్ డిప్యూటీ మేనేజర్ శ్రీనివాస్, లక్ష్మణచాంద ఏవో ప్రవీణ్ కుమార్, నిర్మల్ ఏవో వసంత్‌రావు, ఏఈవోలు మహేశ్వరీ, సంతోష్, పవిత్ర, వివిధ గ్రామాల పసుపు రైతులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షుడిగా నవీన్



నవీన్

నిర్మల్ రూరల్: ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నూతన అధ్యక్షుడిగా నమత్కార్ నవీన్ ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్ స్కాలర్‌షిప్, ఖాళీగా ఉన్న టీచర్ల పోస్టుల భర్తీ కోసం పోరాటం చేస్తామన్నారు. ఇందులో జిల్లా కార్యదర్శి అరవింద్, ఉపాధ్యక్షుడు పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక ఓటరు జాబితాకు చర్యలు



అవగాహన కల్పిస్తున్న అధికారి స్రవంతి

నిర్మల్‌టౌన్: పారదర్శకమైన ఓటర్ జాబితా రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని నిర్మల్ నియోజకవర్గ ఓటర్ జాబితా నమోదు అధికారి బి.స్రవంతి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో అఖిలపక్ష నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్రవంతి మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ద్వారా వచ్చిన జాబితాలో ఆరు కంటే ఎక్కువ పేర్లు ఉన్న ఓటర్లు ఉన్న ఇంటిని తనిఖీ చేసి వాటిలో ఏవైనా ఇంటి నంబర్‌లో మార్పులు ఉంటే సరిచేయడం జరుగుతుందన్నారు. ఈవీఎం డిమాన్‌స్ట్రేషన్ ప్రోగ్రాం నిర్మల్ నియోజకవర్గంలోని అన్ని మండలాలలో ఈనెల 20న ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. ఈ ప్రోగ్రాం ద్వారా ప్రజలకి ఓటు హక్కు వినియోగం, అవగాహన కలుగుతుందని తెలిపారు. క్లైమ్స్, అబ్జెక్షన్స్ ఫాం 6, 7, 8 గురించి వివరించారు. జాబితాను తప్పులు, పొరపాట్లు లేకుండా పారదర్శకంగా తయారు చేస్తామని, ఇందుకు సహకరించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాసర ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న దృశ్యం

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారి హుండీని గురువారం లెక్కించారు. 44 రోజుల హుండీలో రూ.67లక్షలా 8వేలా 400 నగదు, 75 గ్రాముల మిశ్రమ బంగారం, 3కిలోల 600 గ్రామాల మిశ్రమ వెండి, 27 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో బాసర ఆలయ ఈవో విజయరామారావు, యూడీఐ బ్యాంకు సిబ్బంది, వాగ్దేవి సొసైటీ సభ్యులు, కామారెడ్డికి చెందిన శ్రీశైలభ్రమరాంబిక సభ్యులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు



కూలిన ఇంటిని చూపిస్తున్న బాధితురాలు

తాంసి: భీంపూర్ మండలంలోని అంతర్గాం గ్రామంలో గురువారం వర్షానికి ఇల్లు కూలింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి గ్రామానికి చెందిన నిమ్మ సుజాత ఇల్లు పూర్తిగా తడిసిపోయింది. గురువారం ఉదయం కురిసిన భారీ వర్షానికి ఇంటిపై కప్పుతో పాటు ఒకవైపు గోడ పూర్తిగా కూలిపోయింది. ఇల్లు కూలిపోవడంతో ఇంట్లోని వస్తువులు సైతం తడిసి ముద్దయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరులేకపోవడంతో ప్రమాదం తప్పింది. అధికారులు స్పందించి కూలిపోయిన ఇంటిని పరిశీలించి ఆదుకోవాలని బాధితురాలు వేడుకుంటోంది.

గ్రామంలోకి జింకలు

ముధోల్: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జింకలు, దుప్పిలు గ్రామంలోకి వస్తున్నాయి. గురువారం మండల కేంద్రం ముధోల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో గుంపులు గుంపులుగా జింకలు రోడ్డుపైకి వచ్చి పంట పొలాలకు వెళ్లిపోయాయి. వర్షం వలన జంతువులు సైతం ఊరిలోకి వస్తున్నాయి.

అడవి పంది దాడిలో ఒకరికి గాయాలు



క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

నేరడిగొండ: మండలంలోని కుమారి గ్రామంలో బాగోతుల సాయి వ్యవసాయ పంట క్షేత్రాన్ని పరిశీలించడానికి గురువారం వెళ్లాడు. పంట క్షేత్రాన్ని సందర్శించిన అనంతరం తిరిగి వస్తుండగా అడవి పంది అతడిపై దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు. చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ రైతులు గమనించి 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం బోథ్ ఆస్పత్రికి తరలించారు.

అప్రమత్తతే రక్ష

- వర్షాకాలంలో వ్యవసాయ మోటార్ల వద్ద అప్రమత్తత అవసరం
- జాగ్రత్తలు పాటిస్తేనే ప్రమాదాల నుంచి రక్షణ
- స్వీయ మరమ్మతులు వద్దంటున్న విద్యుత్‌శాఖ అధికారులు



స్టార్టర్ వద్ద మోటార్ ఆన్ చేస్తున్న రైతు

నిర్మల్ ఖిల్లా: కొన్ని రోజులుగా వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. దీంతో రైతులు తమ పంట పొలాల్లో బిజీబిజీగా ఉన్నారు. ఇప్పటికే విత్తనాలు నాటడం, వరి నాట్లు వేయడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో రైతులు తమ పొలంలోని బోర్లను సిద్ధం చేసుకుంటున్నారు. ముసురుతో పొలాలన్నీ తడిగా ఉండడంతో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ. పొలాలకు నీరందించే క్రమంలో మోటార్లు, స్టార్టర్లకు విద్యుత్ వైర్లు తగిలి ఉండడం సహజం. దీంతో విద్యుత్ ప్రవహించి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఎక్కువ. చిన్నపాటి అలసత్వంతో రైతులు మృత్యువాత పడిన ఉదంతాలు జిల్లాలో ఎన్నో ఉన్నాయి. ఈ నేపథ్యంలో రైతులు పాటించాల్సిన జాగ్రత్తలపై సాక్షి అందిస్తున్న కథనం.

మోటార్ల వద్ద తడిగా ఉండకుండా చూసుకోవాలి...

ప్రమాదాల నుంచి రక్షించుకోవడానికి మోటార్ల వద్ద తడిగా ఉండకుండా జాగ్రత్త పడాలి. విద్యుత్ మోటార్లను తడి ప్రదేశాల్లో ఉంచకుండా తేమ తగలని పొడి ప్రదేశంలో, కాస్త ఎత్తులో ఏర్పాటు చేసుకోవాలి. మోటార్ పంపు సెట్లను రైతులు విద్యుత్‌పై అవగాహన లేకుండా సొంతంగా మరమ్మతులు చేసుకుంటూ ఉంటారు. దీంతో ప్రమాదాలకు ఆస్కారం ఉంటుంది. మోటారుకు సంబంధించిన ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు సంబంధిత మెకానిక్‌లను సంప్రదించి మరమ్మతులు చేయించుకోవాలి.

విద్యుత్ స్టార్టర్ల వద్ద..

స్టార్టర్లకు వర్షపు చినుకులు తగలకుండా చెక్క పెట్టెలో అమర్చుకుంటే ప్రమాదాలను నివారించుకోవచ్చు. విద్యుత్ ప్రసరింపజేయని నాణ్యమైన ప్లాస్టిక్ పెట్టెలో విద్యుత్ స్టార్టర్లను అమర్చుకోవడం ద్వారా విద్యుత్ షాక్ లాంటివి నివారించుకోగలుగుతాము. ఒక్కోసారి ఎలుకలు విద్యుత్ తీగలని కొరికివేయడంతో ఇనుప డబ్బాలకు వైర్లు తగిలి, విద్యుత్ ప్రసరించే అవకాశాలు ఉంటాయి. రైతులు ముందు జాగ్రత్తగా విద్యుత్ స్టార్టర్లను చెక్క పెట్టెలో లేదా ప్లాస్టిక్ డబ్బాలలో కాస్త ఎత్తులో అమర్చుకొని వర్షం నీరు చేరకుండా వాటిపైన పైకప్పును ఏర్పరుచుకోవాలి. విద్యుత్ స్తంభం నుంచి వ్యవసాయ క్షేత్రంలోని మోటార్ వరకు నాణ్యమైన విద్యుత్ సర్వీసు వైరును వాడాలి.



ఇలాంటి స్టార్టర్ల వద్ద అప్రమత్తత అవసరం

విద్యుత్ అధికారుల సూచనలు..

విద్యుత్ స్తంభం నుంచి వ్యవసాయ మోటారుకు మధ్య దూరం ఎక్కువ ఉండకుండా చూసుకోవాలి. విద్యుత్ స్తంభం నుంచి మోటారుకు కరెంట్ నేరుగా సరఫరా కాకుండా మధ్యలో ఫ్యూజ్, బ్యాక్, స్టార్టర్ తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. విద్యుత్ సరఫరాలో లోపం ఉంటే మెకానిక్‌తో మరమ్మతులు చేయించుకోవాలి. వర్షాలకు తెగిపడిన కరెంట్ తీగలకు, విరిగిన విద్యుత్ స్తంభాలకు విద్యుత్ సరఫరా అయితే వెంటన అధికారులకు తెలియజేసి సరఫరా నిలిపి వేసేలా చర్యలు తీసుకోవాలి. విద్యుత్ పనులు చేస్తున్నప్పుడు మేకులు లేని బూట్లు, తడి తగలని రబ్బరు లేదా ప్లాస్టిక్ చెప్పులు వేసుకోవాలి.

ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు



విద్యుత్ షాక్‌తో మృత్యువాత పడిన ఎద్దు (ఫైల్)

- గత సోమవారం నర్సాపూర్(జి) మండలంలోని నందన్ గ్రామంలో రూపేష్ అనే రైతుకు చెందిన మేతకు వెళ్లిన గిరిజాతి ఆవు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్‌షాక్‌తో మృత్యువాతపడింది.
- ఏడాదిన్నర క్రితం నిర్మల్ జిల్లా బాసర మండలంలోని కిర్గుల్(కె)కు చెందిన రైతు రాజలింగం(47) విద్యుత్ తీగ తగిలి మృత్యువాతపడ్డాడు.
- ఎనిమిది నెలల క్రితం సారంగాపూర్ మండలంలోని చించోలి బి గ్రామానికి చెందిన శంకర్ ఆవు గడ్డిని మేస్తూ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ కంచెకు తగిలి విద్యుత్‌షాక్‌తో మృతిచెందింది.
- గత సెప్టెంబర్‌లో మామడ మండలంలోని పొనకల్ గ్రామంలో ఒకేరోజు ఇద్దరు వ్యక్తులు విద్యుత్‌షాక్‌తో మృతి చెందారు. మద్దిపడగ మల్లయ్య గొర్రెల కాపరి ఫెన్సింగ్ తీగకు విద్యుత్ ప్రసారం కావడంతో దానికి తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. అదే గ్రామానికి చెందిన ధ్యాగల బొర్రన్న అనే రైతు పొలం గట్టుపై పశుగ్రాసం కోసే క్రమంలో తడిగా ఉన్న ప్రాంతంలో విద్యుత్ ప్రసరించి షాక్‌కు గురై మరణించాడు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



గత కొన్ని రోజులుగా కురుస్తున్న ముసురు నేపథ్యంలో రైతులు పంట పొలాల్లో వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఈ క్రమంలో విద్యుత్ మోటారు స్టార్టర్ల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. బోర్ల విషయంలో నాణ్యమైన సర్వీస్ వైరును వాడుతూ, స్టార్టర్ బాక్సులు తడి లేని ప్రదేశంలో ఎత్తులో ఏర్పరుచుకోవాలి.

– జయవంత్‌రావు చౌహాన్,
ఎస్ఈ, విద్యుత్‌శాఖ జిల్లా అధికారి, నిర్మల్

బాసర హుండీలో 'ట్రిపుల్‌ఐటీ' లేఖ

- లేఖ రాసి వేసిన తల్లిదండ్రులు
- పిల్లలను రక్షించాలంటూ వేడుకోలు

భైంసా: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసరలో గురువారం సరస్వతీ అమ్మవారి ఆలయ హుండీని లెక్కిస్తుండగా ఓ లేఖ బయట పడింది. స్థానిక ట్రిపుల్‌ఐటీలో చదువుతున్న విద్యార్థుల సమస్యలకు సంబంధించిన లేఖ అది. విద్యార్థుల ఆత్మహత్యలు, వర్సిటీలో ఇతర సమస్యలపై వారి తల్లిదండ్రులు ఈ లేఖ రాయడం విశేషం. అందులో అక్కడి పరిస్థితులు, పోరాటాలు ఇతర విషయాలపై తల్లిదండ్రులు ప్రస్తావించారు. తమ పిల్లలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలమ్మా.. అంటూ చదువులతల్లిని వారు వేడుకుంటున్నట్లు ఆ లేఖలో రాశారు.

బాల రచయితకు కేంద్ర స్కాలర్‌షిప్



శ్రీజను అభినందిస్తున్న ఎమ్మెల్యే రామన్న

ఆదిలాబాద్‌టౌన్: కేంద్ర ప్రభుత్వ సాహిత్య సాంస్కృతిక జాతీయ స్థాయి స్కాలర్‌షిప్‌కు జైనథ్ మండలం కూర ఉన్నత పాఠశాల విద్యార్థిని గీస శ్రీజ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోరెడ్డి అశోక్ తెలిపారు. ప్రతీ ఏడాది కేంద్ర సాంస్కృతిక వనరులు, శిక్షణ కేంద్రం 30మంది విద్యార్థులను ఎంపిక చేసి సంవత్సరానికి రూ.3600 ఒక్కో విద్యార్థికి 20ఏళ్ల వచ్చే వరకు అందజేయనుంది. ఇందులో భాగంగా శ్రీజ ఎంపిక కావడంతో ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని రచనలు చేయాలని, తనవంతు సహకారం అందిస్తానన్నారు. ఇదిలా ఉండగా జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీతతో పాటు జైనథ్ ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, సర్పంచ్ అడ్డి లత వెంకటరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ అశోక్ అభినందించారు.

బోథ్ ఎమ్మెల్యే బాపూరావ్‌కు నిరసన సెగ



రోడ్డు పనులు చేపట్టాలని ఎమ్మెల్యేను కోరుతున్న యువకులు

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామ రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని గ్రామ యువకులు గురువారం బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్‌ను అడ్డుకుని నిరసన తెలిపారు. భీంపూర్ మండలం నిపాని రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వెళ్తున్న ఎమ్మెల్యేను గ్రామశివారులో అడ్డుకొన్న యువకులు రోడ్డు పనుల కోసం నిలదీశారు. రోడ్డు సరిగా లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బండల్‌నాగాపూర్ నుంచి కప్పర్ల వరకు రోడ్డు పనులు వేగంగా చేపట్టేలా చూడాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసేలా చూస్తామని యువకులకు హామీ ఇచ్చారు.

డివిజన్ ఉద్యమం ఉధృతం

- వార్డు సభ్యుల రాజీనామా
- సోషల్‌మీడియాలో ట్వీట్లు
- దీక్ష శిబిరానికి స్పందన



రాజీనామా పత్రాన్ని ఇస్తున్న బోథ్ వార్డు సభ్యురాలు సునీత



రాజీనామా పత్రాన్ని ఇస్తున్న నక్కలవాడ వార్డు సభ్యులు

బోథ్: బోథ్‌ను రెవెన్యూ డివిజన్ చేయాలని చేపట్టిన ఉద్యమం ఉధృతమవుతోంది. బుధవారం మర్లపెల్లి పంచాయతీకి చెందిన వార్డు సభ్యురాలు రాజీనామా చేయగా, గురువారం బోథ్ మేజర్ పంచాయతీ వార్డు సభ్యురాలు మెరుగు సునీత, నక్కలవాడ పంచాయతీ సభ్యుడు అడప నవీన్ పదవులు వీడారు. రాజీనామా పత్రాలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అందించారు. వీరిని బోథ్ డివిజన్ సాధన సమితి సభ్యులు దీక్ష స్థలి వద్ద శాలువాలతో సత్కరించారు. గురువారం నాలుగోరోజు బోథ్ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు దీక్ష శిబిరంలో కూర్చున్నారు. వీరికి రైల్వే బోర్డు సభ్యుడు జీవీ రమణ తదితరులు సంఘీభావం తెలిపారు.

సోషల్ మీడియా ద్వారా ట్వీట్లు

ఉద్యమ ప్రణాళికలో భాగంగా గురువారం సీఎం కార్యాలయం, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, కలెక్టర్‌కు ట్వీట్లు చేశారు. వాట్సాప్, ఫేస్‌బుక్ ద్వారా ఉద్యమతీరును, డివిజన్ ఆకాంక్షను వివరించారు. ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరారు.

ఉద్యమానికి ఊపిరిగా రాజీనామాలు

డివిజన్ ఉద్యమానికి వార్డు సభ్యుల రాజీనామాలు ఊపిరిపోస్తున్నాయి. ఇప్పటివరకు ముగ్గురు వార్డు సభ్యులు రాజీనామా చేశారు. బోథ్, మర్లపెల్లి, నక్కలవాడకు చెందిన వార్డు సభ్యులు పదవులు వీడారు. శుక్రవారం మరికొంతమంది రాజీనామాలు చేయనున్నట్లు సమాచారం. బోథ్‌లో స్థానికంగా ఉన్న ఎంపీటీసీలూ రాజీనామా యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇద్దరు సొసైటీ డైరెక్టర్లు రాజీనామా చేస్తామని ప్రకటించారు. కనుగుట్ట గ్రామానికి చెందిన వార్డు సభ్యులు రాజీనామాకు సిద్ధపడినట్లు తెలుస్తోంది. ఇప్పటికే డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రస్థాయికి తీసుకెళ్లేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

యువకుడిపై స్క్రూడ్రైవర్‌తో దాడి



తీవ్రంగా గాయపడిన తోట శంకర్

భైంసాటౌన్: భైంసా పట్టణంలోని గోపాల్‌నగర్‌కు చెందిన తోట శంకర్‌పై సంతోషిమాత నగర్‌కు చెందిన కాంతం నరేశ్ బుధవారం అర్ధరాత్రి స్క్రూడ్రైవర్‌తో విచక్షణ రహితంగా దాడి చేసిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. పట్టణ సీఐ ఎల్.శ్రీను కథనం ప్రకారం.. కుభీర్ మండలం పల్సి గ్రామానికి చెందిన నరేశ్ భైంసాలోని సంతోషిమాత నగర్‌లో నివాసముంటూ స్థానికంగా ఓ మిల్లులో పనిచేస్తున్నాడు. అదే మిల్లులో పనిచేస్తున్న శంకర్ భార్యతో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో తన భర్త వేధిస్తున్నాడంటూ నరేశ్ వద్ద వాపోయేది. దీంతో బుధవారం అర్ధరాత్రి నరేశ్ బైక్‌పై శంకర్ ఇంటికి వచ్చి నీ భార్యను ఎందుకు వేధిస్తున్నావంటూ ప్రశ్నించాడు. దీంతో వారి మధ్య గొడవ జరుగగా, నరేశ్ తన వెంట తెచ్చుకున్న స్క్రూడ్రైవర్‌తో శంకర్‌పై విచక్షణారహితంగా దాడి చేశాడు. శంకర్ కేకలు వేయడంతో నరేశ్ బైక్‌ను అక్కడే వదిలి పారిపోయాడు. స్థానికులు బాధితుడిని భైంసా ఏరియాస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోడు కోసం అటవీభూమి చదును

- అడ్డుకున్న అటవీ అధికారులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న అటవీ అధికారులు

కడెం: మండలంలోని లక్ష్మిసాగర్‌తండా వాసులు గురువారం గ్రామ శివారులో పోడు సాగు కోసం అటవీ భూమిని చదును చేస్తుండగా అటవీ అధికారులు అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అటవీ భూమిలో రెండు చెట్లు, పొదలను నరికి చదును చేస్తుండగా అడ్డుకున్నామని, బానవత్ కలురాం, బాలురాం అనే ఇద్దరి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో చోలే అనిత పేర్కొన్నారు. అటవీ భూమిలో చెట్లు నరకడం, చదును చేయడం చట్టారీత్యా నేరమని, అట్టి వారికి శిక్షలు తప్పవని హెచ్చరించారు.

అటవీ అధికారుల దౌర్జన్యం ఆపాలి

గిరిజనులపై అటవీ అధికారుల దౌర్జన్యం ఆపాలని ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ వినోద్‌నాయక్ అన్నారు. గురువారం ఈ విషయమై మండల కేంద్రంలోని రేంజ్ కార్యాలయంలో ఎఫ్ఆర్వో అనితతో మాట్లాడారు. గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూముల్లో సాగు పనులు చేయనీయకుండా అటవీ సిబ్బంది అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు తుమ్మల మల్లేశ్ ఉన్నారు.

ఉరివేసుకుని ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూహౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన చిలుక రవీందర్(31) గురువారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై సవిత తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. రవీందర్ ఐదు రోజుల కిందట అనారోగ్యానికి గురయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స పొంది బుధవారం ఇంటికి వచ్చాడు. మద్యానికి బానిసైన రవీందర్ ఇంటికి రాగానే గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. తలుపులు ఎంతకీ తీయకపోవడంతో రవీందర్ తండ్రికి సమాచారం అందించగా అతడు చేరుకుని తలుపులు తొలగించేసరికి ఉరివేసుకుని కనిపించాడు. మృతుడి భార్య గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వివరించారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం

తాండూర్(బెల్లంపల్లి): మండలంలోని బోయపల్లి బోర్డు వద్ద జాతీయ రహదారిపై గురువారం కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. చౌటపల్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన పోచంపల్లికి చెందిన అల్లకొండ పోశం (50) కాలినడకన రోడ్డు దాటుతుండగా ఆసిఫాబాద్ వైపు నుంచి బెల్లంపల్లి వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవర్ అతివేగంగా డ్రైవింగ్ చేయడంతో ప్రమాదం జరిగిందని ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

జరిమానా పడకుండా 'మాస్క్'



ట్రాఫిక్ పోలీసుల చలాన్లు నుంచి తప్పించుకు నేందుకు ద్విచక్ర వాహనదారులు కొత్తకొత్త ఎత్తుగడలను పాటిస్తున్నారు. తాజాగా ఓ యువకుడు తన ద్విచక్ర వాహనం నంబర్ ప్లేట్ కనిపించకుండా ముఖానికి ధరించాల్సిన మాస్క్‌తో కప్పేయడం గమనార్హం.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఖానాపూర్‌లో నరకదారులు



ఖానాపూర్‌లో గుంతలతో బురదమయంగా రోడ్డు

ఖానాపూర్ పట్టణంలో నత్తనడకన సాగుతున్న రోడ్డు వైడెంగ్ పనులు నరకానికి దారులుగా మారుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనులు ప్రారంభించి రెండేళ్లు కావస్తున్నా కనీసం 50శాతం కూడా పూర్తికాలేదని ప్రశ్నిస్తున్నారు. సుందరీకరణ, అభివృద్ధి పేరుతో పట్టణంలో సెంట్రల్ లైటింగ్, డివైడర్, రోడ్డువైడెంగ్ పనులు చేపట్టారు. పనులు నేటికీ పూర్తికాక ప్రతీ రోజు ఎక్కడో ఒకచోట ప్రమాదం జరగడం పరిపాటిగా మారింది. వేసవిలోనూ దుమ్ము ధూళితో ప్రజలు నానా ఇక్కట్లు పడ్డారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రధాన రోడ్డంతా బురదమయంగా మారి గుంతలతో ప్రజలు నానా ఇక్కట్లు పడుతున్నారు. బురద, గుంతలమయంగా ఉన్న రోడ్డుపై నుంచి వర్షంలో తొందరగా ఇంటికి వెళ్లాలనే ఆత్రతలో వాహనదారులు రోడ్డుపై గుంతల్లో ఇరుక్కుని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - ఖానాపూర్







ఖానాపూర్ పట్టణంలో వర్షంతో మట్టిలో కూరుకుపోయిన ఆటో, కార్లు



గుంతలో పడి విరిగిన కారు టైరురాడ్

క్లుప్తంగా

'అక్రమ కేసులు సరికాదు'

నిర్మల్‌రూరల్: ఇటీవల సర్సాపూర్(జి) మండలంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వాహన శ్రేణిని అడ్డుకున్నారనే కారణంతో పోలీసులు కాంగ్రెస్ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేయడం సరికాదని ఆ పార్టీ నాయకులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. కాంగ్రెస్ నాయకులు దేవేందర్‌ను పోలీసులు అరెస్ట్ చేసి గురువారం న్యాయస్థానం తరలించారు. ఆయనను న్యాయస్థానంలో శ్రీహరిరావు పరామర్శించి మాట్లాడారు. ప్రశ్నించే గొంతుకలను అరెస్టు చేస్తూ కేసీఆర్ ప్రభుత్వం రాజ్యమేలుతోందన్నారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సహించండి



సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

సారంగపూర్: పండ్లతోటల సాగుకు ముందుకొచ్చే రైతులను ప్రోత్సహించాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. గ్రామాల్లో సామూహిక ఇంకుడుగుంతల నిర్మాణాలను పూర్తి చేయించాలని సూచించారు. ఏపీడీ ఓస ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

23న వివాహ పరిచయ వేదిక

కుభీర్: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 23న మధ్యాహ్నం ఒంటి గంటకు పద్మశాలీల వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు పద్మశాలి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బూర ఉమాశంకర్ అన్నారు. గురువారం కుభీర్‌లో విలేకరులతో మాట్లాడారు. యువతీ, యువకులు పాస్‌ఫొటోలు, వివరాలతో హాజరవాలని కోరారు.

సదర్మాట్ వద్ద రక్షణ చర్యలు చేపట్టాలి

ఖానాపూర్: మండలంలోని మేడంపల్లిలో సదర్మాట్ వద్ద సందర్శకులు ప్రమాదానికి గురికాకుండా అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని ఖానాపూర్ మొగల్‌పుర సొసైటీ కమిటీ సభ్యులు కోరారు. ఈ విషయమై గురువారం స్థానిక ఇరిగేషన్ అధికారి నవీన్, తహసీల్దార్ కార్యాలయంలో వేర్వేరుగా వినతిపత్రాలను అందజేశారు. సదర్మాట్ వద్ద హెచ్చరిక బోర్డులు, సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని కోరారు. సొసైటీ అధ్యక్షుడు ముషీర్, అర్షద్, మోహిద్, సల్మాన్, రిజ్వాన్, రియాజ్, ఇమ్రాన్ తదితరులు ఉన్నారు.

తెగిన తీగ.. తప్పిన ముప్పు

సర్సాపూర్(జి): మండలంలోని అంజనీతండాలో జగదాంబ ఆలయ సమీపంలో గురువారం సాయంత్రం ఎల్‌టీ లైను విద్యుత్ తీగ చెట్టు కొమ్మ రాపిడికి గురై తెగిపడింది. ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. గ్రామస్తులు సమాచారమివ్వడంతో జేఎల్‌ఎం జావీద్ వచ్చి తీగ సరిచేశారు. గ్రామస్తులు పాత విద్యుత్ తీగను తొలగించి కొత్త తీగను అమర్చాలని కోరారు.

'కాంగ్రెస్‌కు ఆదరణ'

భైంసాటౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్‌కు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సిందే ఆనంద్‌రావుపటేల్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం బాసరకు చెందిన పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు భూమన్న, హైమత్‌ఖాన్, సాయినాథ్‌పటేల్ తదితరులున్నారు.

ఇబ్బందులు రాకుండా చూడాలి

ఖానాపూర్: అధిక వర్షాలతో పట్టణవాసులకు ఇబ్బందులు రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యం అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాలనీల్లోని డ్రెయినేజీల్లో పూడిక పేరుకుపోయి వరద వెళ్లలేని స్థితి నెలకొందన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మన్మోహన్‌కు 11వార్డు సమస్యలను వివరించారు.

నిధులు మంజూరు

లోకేశ్వరం: మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు జెడ్పీ నిధులు రూ.25 లక్షలు మంజూరైనట్లు జెడ్పీటీసీ లోలం కళావతి ఓ ప్రకటనలో తెలిపారు. రాయపూర్‌కాండ్లీల్లో సేడ్ డ్రెయిన్‌కు రూ.రెండు లక్షలు, గడ్చాందలో మొరం రోడ్డుకు రూ.రెండు లక్షలు, హద్గాంలో సీసీ ప్లాట్‌ఫాం కోసం రూ.1.50లక్షలు, కిష్టాపూర్‌లో సైడ్ డ్రెయిన్ కోసం రూ.రెండు లక్షలు, పుస్పూర్‌లో సైడ్ డ్రెయిన్ కోసం రూ.రెండు లక్షలు, మొహాళలో రీడింగ్ కోసం రూ.లక్ష, గడ్చాందలో వెల్మ సంఘం కోసం రూ.రెండు లక్షలు, ఆలయం చుట్టూ ఫెన్సింగ్ కోసం రూ.1.50 లక్షలు, పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు పిప్రికి రూ.లక్ష, ధర్మోరకు రూ.లక్ష, రాజూరలో రూ.లక్ష, వాస్తాపూర్‌కు రూ.లక్ష, లక్ష్మీనగర్‌కు రూ.లక్ష, ఎడ్దూర్‌కు రూ.లక్ష, లోకేశ్వరంలో రూ.లక్ష, హవర్గకు రూ.లక్ష, అబ్దుల్లాపూర్‌కు రూ.లక్ష నిధులు మంజూరు చేశామని పేర్కొన్నారు.

గ్రామాల్లో జోరు వర్షం..

- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- మునిగిన పంటలు, నిలిచిన రాకపోకలు



మసల్గాలో పత్తిపంటలో నిలిచిన వరద



తానూరు : దాగాం శివారులో సోయా పంటలోంచి వెళ్తున్న వరద నీరు

తానూరు: జిల్లాలో గురువారం ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. తానూరు మండలంలోని బెంబర, ఉమ్రి(కే), తానూరు, బోల్సా, మహలింగి, బామ్ని, బెల్‌తరోడా, భోసి గ్రామాల్లో సట్‌వాజీ వాగు, తానూరు వాగు, తొండాల, దౌలతాబాద్, ఝరి(బి) వాగులు ఉధృతంగా ప్రవహించడంతో సమీపంలోని పంటలు నీట మునిగాయి. మహలింగి, బోల్సా, మొగ్లి, జౌలా(బి), తొండాల శివారులో సుమారు వందల ఎకరాల్లో వర్షపు నీరు చేరింది, భోసిలోని వీధుల్లో నీరు చేరడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు.

గంటల పాటు నిరీక్షణ..

మండలంలోని వాడవన, తొండాల, ఝరి(బి) గ్రామాల మార్గంలో ఉన్న లోలెవల్ వంతెనలు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో గంటలపాటు నిరీక్షించి తమ గ్రామాలకు చేరుకున్నారు.

ముధోల్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు నిండుతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో జనజీవనం స్తంభించడంతో వ్యవసాయ పనులకు వెళ్లకుండా రైతులు ఇంటి వద్దే ఉంటున్నారు.

శిథిల ఇళ్లలో ఉండొద్దు

కుంటాల: వర్షాల దృష్ట్యా ప్రజలు శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉండొద్దని కుంటాల ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో రహీం పేర్కొన్నారు. గురువారం మండలంలోని విఠాపూర్, పెంచికల్‌పాడ్, ఓలా గ్రామాల్లో వారు పర్యటించారు. విద్యుత్ స్తంభాల వద్దకు వెళ్లొద్దన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో మంచి నీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలన్నారు. ఎంపీవో రహీం, ఏపీవో గట్టుపల్లి నవీన్, ఏపీఎం భోజన్న తదితరులు పాల్గొన్నారు.



కుంటాల: విఠాపూర్‌లో పర్యటిస్తున్న అధికారులు

24గంటల కరెంట్ ఘనత బీఆర్ఎస్‌దే

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్

పెంబి: దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో 24 గంటలు త్రీఫేజ్ కరెంట్ ఇస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉండటాన్ని కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఓర్వడం లేదన్నారు. ఉచిత కరెంట్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకులకు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగారెడ్డి, సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శంకర్, ఎంపీటీసీ రామారావ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, విలాస్, వసంత్‌రావు, విక్రమ్‌నాయక్, విలాస్, రాజు, రాజేందర్, శ్రీను తదితరులు ఉన్నారు.



పెంబిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఆశ్రమ పాఠశాల తనిఖీ

పెంబిలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను ఎమ్మెల్యే రేఖానాయక్ గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా వంటగదిలోకి వెళ్లి ఆహారం పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలన్నారు. అనంతరం మనఊరు-మనబడిలో అభివృద్ధి చేసిన తరగతి గదులు పరిశీలించారు. వారి వెంట నాయకులు ఉన్నారు.

కడెం: బీఆర్ఎస్ హయాంలోనే రైతులకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. 24 గంటల కరెంట్ ఇచ్చే బీఆర్ఎస్ కావాలా..? మూడు గంటల కరెంట్ ఇచ్చే కాంగ్రెస్ పార్టీ కావాలా అని ప్రశ్నించారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ జీవన్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ సతీశ్, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు వేణుగోపాల్, ఏఎంసీ డైరెక్టర్ మంగ తదితరులు ఉన్నారు.

పోలింగ్‌శాతం పెంచడమే లక్ష్యం

లోకేశ్వరం: గ్రామాల్లో పోలింగ్ శాతం పెంచేందుకే ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం)లపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ సరిత అన్నారు. గురువారం మండలంలోని సేవాలాల్‌తండా, పుస్పూర్ గ్రామాల్లో ఈవీఎంల వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈనెల 20 నుంచి 27వ తేదీ వరకు మండలంలోని గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామన్నారు. సర్పంచ్‌లు జాదవ్ పార్వతిబాయి, నర్సయ్య, డిప్యూటీ తహసీల్దార్ షబ్బీర్, అసిస్టెంట్ నరేశ్ ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్, పెండ్‌పెల్లి, తిమ్మాపూర్ గ్రామాల్లో ఈవీఎంల వినియోగంపై గురువారం తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఆర్ఐ కృష్ణాగౌడ్, సర్పంచులు తదితరులు ఉన్నారు.



లోకేశ్వరం: సేవాలాల్‌తండాలో అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సరిత

సోన్: తహసీల్దార్ కార్యాలయంలో ఈవీఎంల వినియోగంపై బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు గురువారం ఎన్నికల అధికారి సరితారాణి అవగాహన కల్పించారు. ఎంపీడీవో ఉషారాణి, ఎస్‌వో నిషితకుమారి తదితరులు పాల్గొన్నారు.

కడెం: తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఈవీఎంలపై రెవెన్యూ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈవీఎంలతో ఓటు వేసే విధానం, తదితర అంశాల గురించి తహసీల్దార్ చిన్నయ్య వివరించారు. రెవెన్యూ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

దిలావర్‌పూర్: ఓటరు జాబితా రూపకల్పన పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ కరీం సూచించారు. దిలావర్‌పూర్, నర్సాపూర్(జి) మండలాల బీఎల్‌వోలకు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. యాప్‌ను సద్వినియోగం చేసుకుని ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. సంతోష్, సిబ్బంది, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన, అరెస్టు



ఖానాపూర్‌లో గంతలు కట్టుకొని నేతల నిరసన



లక్ష్మణచాందలో అరెస్టయిన నాయకులు



కుభీర్‌లో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నేతలు

ఖానాపూర్: డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరిట కేసీఆర్ ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు పాల్పడిందని బీజేపీ నాయకులు, పెంబి జెడ్పీటీసీ జానుబాయి అన్నారు. కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అరెస్టును నిరసిస్తూ గురువారం పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో కళ్లకు నల్లగుడ్డలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే అనుచరులకే అధికారులు ఇళ్లు కేటాయించారని ఆరోపించారు. పడాల రాజశేఖర్, ఆనంద్, గోపాల్‌రెడ్డి, గిరి, భూమన్న, సంతోశ్, సదాశివ్, శ్రీధర్, రవి, రాజేశ్వర్, సుధాకర్, ఉపేందర్, శ్రావణ్, మనోజ్, గంగాధర్, పవన్, సాయికృష్ణ తదితరులు ఉన్నారు.

ముధోల్: మండల కేంద్రంలో బీజేపీ నాయకులను పోలీసులు గురువారం ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో రమేశ్, ఉమేశ్, శ్రీనివాస్, పోతన్న, యోగేశ్, పోతన్న తదితరులు ఉన్నారు.

భైంసాటౌన్: రాష్ట్రంలో ప్రజాసమస్యలపై ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం జరుగుతోందని.. అక్రమ అరెస్టులకు భయపడేది లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పవార్ రామారావుపటేల్, భోస్లే మోహన్‌రావు పటేల్ అన్నారు. బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల పరిశీలనకు వెళ్తున్న రామారావుపటేల్‌ను ఎస్ఎస్ కాటన్‌లో, దారాబ్జిలో మోహన్‌రావుపటేల్‌ను పోలీసులు వేర్వేరుగా హౌజ్ అరెస్ట్ చేశారు. వారు మాట్లాడుతూ భైంసాలో డబుల్ ఇళ్లను అధికార పార్టీ అండదండలున్న వారికే కేటాయించారని ఆరోపించారు. కుభీర్ మండలం మాలేగాంలో ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదని.. వీర్‌గావ్ తండా, తిమ్మాపూర్‌లో నాసిరకం నిర్మాణాలతో లీకేజీలు ఏర్పడ్డాయన్నారు.

లోకేశ్వరం: డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిశీలనకు వెళ్తున్న బీజేపీ మండలాధ్యక్షుడు సంటేన్నోల్ల గంగాధర్, రాజు, ఇతర కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాల బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారు మాట్లాడుతూ నాసిరకంగా నిర్మించిన ఇళ్ల పరిశీలనకు వెళ్తున్న బీజేపీ నాయకులను అరెస్టు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు గోవర్ధన్, ఉపాధ్యక్షుడు రంజిత్, భరత్ నారాయణ, అల్లూరి రాజు, గంగాధర్, మోహన్, రాజు, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

భైంసాటౌన్: పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద రహదారిపై గురువారం బీజేపీ నాయకులు బీఆర్ఎస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, నాయకుల అరెస్టును నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. పట్టణాధ్యక్షులు మల్లేశ్, నాయకులు పోశెట్టి, రమేశ్, గోపాల్, నందు తదితరులున్నారు.

కుభీర్: బీజేపీ నాయకుల అరెస్టు నిరసిస్తూ గురువారం ఆ పార్టీ నాయకులు మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల విషయంలో ఎమ్మెల్యేల అక్రమాలు బయటపడతాయని కేసీఆర్ ప్రభుత్వం బీజేపీ నాయకులను అరెస్ట్ చేసిందన్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి గంగాధర్, కమ్‌లేశ్, జాదవ్ పండిత్ తదితరులు ఉన్నారు.

సమాఖ్య ఆర్థికాభివృద్ధిపై దృష్టి సారించాలి

దిలావర్‌పూర్: గ్రామైఖ్య సంఘాలను బలోపేతం చేస్తూ మండల సమాఖ్య ఆర్థికాభివృద్ధిపై దృష్టి సారించాలని అదనపు డీఆర్‌డీఓ గోవింద్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో మండల సమాఖ్య మహాజన సభ గురువారం నిర్వహించారు. మండల సమాఖ్య గతేడాదిలో చేపట్టిన కార్యక్రమాలు, ఆర్థికాభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సభ్యులు రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. అనంతరం మండల సమాఖ్య కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ముస్కు సునీత, కార్యదర్శిగా శ్యామల, ఉపాధ్యక్షురాలిగా శ్రీజ, కోశాధికారిగా సంయుక్తను ఎన్నుకున్నారు. డీపీఎంలు రాజేశ్వర్, విజయలక్ష్మి, ఏపీఎంలు సులోచన, సుదర్శన్, ఆర్జాబాయి, ముత్యం, వీఓఏలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసన

భైంసా: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామారావుపటేల్ డిమాండ్‌చేశారు. గురువారం బాసరలో కార్మికులకు సంఘీభావం ప్రకటించారు.

దస్తురాబాద్: సమస్యలు పరిష్కరించాలని మున్యాలలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు.

ఖానాపూర్: ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన దీక్ష గురువారం 15 రోజుకు చేరింది. చంద్రశేఖర్, నాగరాజు, స్వామి, పోశెట్టి ఉన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

ముధోల్: తమది రైతుల ప్రభుత్వమని.. వారి సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బ్రహ్మణ్‌గావ్ రైతువేదికలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు సరిపడ కరెంటు ఇవ్వలేదని విమర్శించారు. అనంతరం వికోలిలో రూ.2.5లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అభివృద్ధి పనులకు జెడ్పీ నిధుల నుంచి విడుదలైన రూ.15లక్షల ప్రొసీడింగ్ అందజేశారు. ఖాలీద్, శ్రీనివాస్‌గౌడ్, వంశీకృష్ణ, రవీందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కాంగ్రెస్‌కు ఓటేస్తే చీకటే గతి

- మంత్రి ఐకేరెడ్డి

సారంగపూర్: కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే కరెంట్ కోతలు విధించి చీకటిమయం చేస్తారని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని స్వర్ణ రైతువేదికలో రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ రైతులకు 24 గంటల కరెంట్ ఇస్తున్నారని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ నాయకులు మాత్రం కనీస అవగాహన లేకుండా తాము అధికారంలోకి వస్తే మూడు గంటల కరెంట్ ఇస్తామని మాట్లాడుతున్నారని పేర్కొన్నా రు. కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లోకి వస్తే రైతులు తరిమికొడతారన్నారు. నారాయణరెడ్డి, వెంకట్రాం రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి

మంత్రి సంతాపం

నిర్మల్‌టౌన్: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి సి.రామచంద్రారెడ్డి మృతి పట్ల మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా పనిచేసిన ఆయన మరణవార్త కలిచివేసిందన్నారు. వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

మొలకెత్తని సోయా విత్తనాలు

- ఆందోళనలో అన్నదాతలు
- అధికారులు న్యాయం చేయాలని వేడుకోలు

కుంటాల: వేసిన సోయా విత్తనాలు మొలకెత్తి మంచి దిగుబడులు వస్తాయనుకున్న రైతులకు నిరాశే ఎదురైంది. కుంటాలకు చెందిన రైతులు మహారాష్ట్రలోని భోకర్ ప్రాంతం నుంచి యశోద కేడీఎస్ 726 రకం సోయా విత్తనాలు తీసుకొచ్చి 39 ఎకరాల్లో విత్తారు. 25 కిలోల విత్తనాల బస్తా ధర రూ.2300కు కొనుగోలు చేశారు. ఆరుగురు రైతులు కొనుగోలు చేసిన ఒకే లాట్ రకం విత్తనాలు చేనులో నాటగా మొలకెత్తలేదు. దీంతో వారు రూ.లక్ష మేర నష్ట పోయారు.



మొలకెత్తకపోవడంతో బీడు భూమిలా చేను

దీంతోస్థానిక రైతులు విత్తనాలు మొలకెత్తలేదని మహారాష్ట్రలోని భోకర్‌కు వెళ్లి వ్యాపారిని ప్రశ్నించినా స్పందన కరువైంది. దీంతో చేసేదేం లేక ఇటీవల నిర్మల్‌లో జిల్లా వ్యవసాయధికారిని కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు.

అధికారులు ఆదుకోవాలి



మంచి దిగుబడులు వస్తాయని ఆరుగురం భోకర్ నుంచి సోయా విత్తనాలు తెచ్చి విత్తాం. ఇప్పటికీ మొలకెత్తలేదు. దీంతో పెట్టుబడులతోపాటు పంట కాలం నష్టపోయే ప్ర మాదం ఉంది. ఇప్పుడు ఏయే పంట వేయాలో అర్థం కావడం లేదు. అధికారులు స్పందించి నష్టపరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలి. – తోట రాజేందర్, రైతు, కుంటాల

రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం

వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోయినా, విత్తనాలు నకిలీవయినా మొలకెత్తవు. దీనిపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తాం. రైతులు ఆందోళన చెందవద్దు.. న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం. – అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

సాయిబాబా ఆలయంలో పూజలు



నిర్మల్‌లో దాతలను సన్మానిస్తున్న ఆలయ చైర్మన్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గండి రామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అన్నదాతలుగా నిలిచిన సునంద-పోతారెడ్డి, చిటికేసి లక్ష్మి-శ్రీనివాస్ దంపతులను ఆలయ సింగిల్ ట్రస్ట్ చైర్మన్ లక్కడి జగన్మోహన్‌రెడ్డి పూలమాలలతో సన్మానించారు. సాయి దీక్ష సేవా సమితి సభ్యులు ఉప్పుల నందు, జిందం గోవర్ధన్, సోమేష్, భూషణ్, చౌదరి, శ్రీధర్, రేణుకదాస్ పాల్గొన్నారు.



సీఐ దంపతులను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

సీఐ ప్రత్యేక పూజలు

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. భైంసా గ్రామీణ సీఐ నైలు సతీ సమేతంగా పూజలు నిర్వహించారు. వారికి వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం సీఐ దంపతులను సన్మానించారు. వారి వెంట ఎస్సై హన్మాండ్లు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు. అంతకుముందు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

సంక్షిప్త వార్తలు

భవనానికి నిధులు మంజూరు

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి గ్రామంలో అంబేద్కర్ సంఘ భవన నిర్మాణానికి మంత్రి ఐకేరెడ్డి రూ.15 లక్షలు మంజూరు చేశారని సంఘం సభ్యులు తెలిపారు. గురువారం మునిపెల్లి గ్రామ అంబేద్కర్ సంఘం సభ్యులు జిల్లా కేంద్రంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని కలిసి విన్నవించగా వెంటనే నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్, బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి, క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం

నిర్మల్‌టౌన్: మున్నూరుకాపు సంఘం పట్టణ యువజన సంఘం కార్యవర్గాన్ని నిర్మల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎ నూతన అధ్యక్షుడిగా గంట రాకేశ్, ఉపాధ్యక్షులుగా నరేందర్, అనిల్, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా సందీప్, శివ, కోశాధికారిగా చిరంజీవి, ఉపకోశాధికారిగా చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు.

అన్నదానం

నిర్మల్‌టౌన్: బ్యాంక్ ఆఫ్ బరోడా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని వృద్ధాశ్రమంలో గురువారం అన్నదానం నిర్వహించారు. అంతకుముందు బ్యాంకులో పూజలు చేశారు.

నామినీ వివరాలు సేకరణ

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్‌కు చెందిన జడ రాజేశ్వర్ అనే రైతు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో గురువారం కనకాపూర్ క్లస్టర్ ఏఈవో సంతోశ్ రాచాపూర్‌లోని రాజేశ్వర్ ఇంటికి వెళ్లి నామినీ వివరాలు సేకరించారు. నామినీ ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం వంటి వివరాలు నమోదు చేసుకున్నారు.

చెక్కు అందజేత

భైంసారూరల్: మండలంలోని చింతల్‌బోరి గ్రామానికి చెందిన బోడికేవార్ పోతన్నకు గురువారం రూ.50వేల విలువైన చెక్కు అందజేశారు. దివ్యాంగుల శాఖ నుంచి మంజూరైన చెక్కును మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కల్పనజాదవ్ లబ్ధిదారుడికి అందించారు. సర్పంచ్ విజయబాయి, ఎంపీడీఓ గోపాలకృష్ణారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

అవగాహన

సోన్:మండలంలోని న్యూవెల్మల్‌లో ఆయిల్ పాం సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఏవో వినోద్ మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీ కల్పిస్తుందని సాగుకు ముందుకు రావాలన్నారు. ఎంపీటీసీ నాగయ్య, సర్పంచ్ గంగామణి, శ్రీనివాస్, సాయన్న పాల్గొన్నారు.